


ఎన్నికల ప్రచార రథం ప్రారంభం

వినుకొండ(నూజెండ్ల): వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారాల్లో భాగంగా జయహో జయహో మా బ్రహ్మన్న అనే పాటను. ప్రచార రథాన్ని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రారంభించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 514.60 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 3,031, ఎస్ఎల్బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6500, గరిష్ట ధర రూ.7800, మోడల్ ధర రూ.7200 వరకు పలికింది.

న్యూస్‌రీల్


సిద్ధం సభకు పటిష్ట బందోబస్తు

మేదరమెట్ల: బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం పీ.గుడిపాడు జాతీయ రహదారి సమీపంలో ఆదివారం నిర్వహించనున్న సిద్ధం సభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతున్న సందర్భంగా పోలీసు అధికారులు పటిష్ట బందోబస్తు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు గుంటూరు రేంజి ఐజీ పాలరాజు, అడ్మిన్ ఐజీ ఎం.రవీంద్రనాథ్‌బాబు, ఎస్పీ వకుల్ జిందాల్ మేదరమెట్లలో శుక్రవారం పోలీసు అధికారుల సమావేశంలో వెల్లడించారు. జిల్లా పోలీసు అధికారులు తీసుకుంటున్న బందోబస్తు గురించి ఎస్పీ వివరించారు. సిద్ధం సభకు మొత్తం 10 లక్షలకు పైగా ప్రజలు హాజరవుతారని, సభకు వచ్చే వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు, సభ నిర్వహణకు మొత్తం 338 ఎకరాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. సభ సజావుగా జరిగేందుకు ప్రతి పోలీసు అధికారి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఐజీ మాట్లాడుతూ సిద్ధం సభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరవుతున్న సందర్భంగా వాహనాలను దారి మళ్లింపు విషయంలో ప్రజలకు అర్థమయ్యేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం కమ్యూనికేషన్ సెట్‌ల ద్వారా ఉన్నతాధికారుల సూచనలు పాటిస్తూ విధులు నిర్వహించాలన్నారు. సభకు వచ్చే వాహనాలు ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా వాహనాలను వరుస క్రమంలో పార్కింగ్ చేయించాల్సిన బాధ్యత కూడా పోలీసులపై ఉందన్నారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, ప్రకాశం జిల్లా ఎస్పీ పీ.పరమేశ్వరరెడ్డి, నెల్లూరు జిల్లా ఎస్పీ డాక్టర్ కే.తిరుమలేశ్వరరెడ్డి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర పన్నుల శాఖ డీసీటీవో సస్పెన్షన్

పాత గుంటూరు: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రభుత్వ ఆదాయానికి భారీస్థాయిలో నష్టం కలిగించిన బ్రాడీపేట సర్కిల్ డీసీటీవో ఎ.మంజులను సస్పెండ్ చేస్తూ ఈనెల 7వ తేదీన రాష్ట్ర పన్నుల ముఖ్య కమిషనర్ గిరిజాశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. శాఖ బ్రాడీపేట సర్కిల్‌లో జరిగిన ట్రేడర్స్ అక్రమాలు, అధికారుల విధుల నిర్లక్ష్యంపై గతేడాది ఆగస్టులో సాక్షిలో ప్రచురితమైన కథనంపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే... నగరంలోని మహేంద్ర కాటన్ ట్రేడర్స్ రూ.4.42 లక్షలు పన్నులు చెల్లించక పోయినా ట్రేడర్స్‌పై చర్యలు తీసుకోకుండా అధికార దుర్వినియోగంతో ఇచ్చిన నోటీసును రద్దు పరుస్తూ డీసీటీవో ఆర్డర్ పాస్ చేశారు. ఇటువంటి ఆర్డర్లను పాస్ చేయాలంటే ప్రొసీజర్ ప్రకారం ఉన్నతాధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేకుండానే జారీ చేసిన ఆర్డర్ వలన ప్రభుత్వానికి భారీ నష్టం వాటిల్లింది. దీనిపై స్పందించిన గుంటూరు 2 డివిజన్ జాయింట్ కమిషనర్ బ్రాడీపేట అసిస్టెంట్ కమిషనర్‌చే ట్రేడర్స్ నిర్వాకంపై ఆడిట్ చేయించగా మొత్తం రూ.10 కోట్లు ఆ డీలర్ ప్రభుత్వానికి ఎగనామం పెట్టినట్లు తేలింది. విధుల పట్ల నిర్లక్ష్యంతో కోట్ల రూపాయల ప్రభుత్వ ధనాన్ని నష్టపరిచిన డెప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ మంజులను సస్పెండ్ చేసినట్లు బ్రాడీపేట సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ వివేక్ ఆనంద్ తెలిపారు. అధికారిపై చర్యలు తీసుకోవడంలో 9 నెలలపాటు నిర్లక్ష్యం వహించిన కొందరు ఉన్నతాధికారులపై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లుగా తెలిసింది.

దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు పట్టు వస్త్రాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై జరిగే దుర్గామల్లేశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవానికి మంగళగిరి చేనేత పట్టువస్త్రాలను శుక్రవారం సమర్పించారు. శ్రీ శివ భక్త మార్కండేయ వంశీకులు ప్రతి ఏడాది మహా శివరాత్రికి పట్టువస్త్రాలను సమర్పించడం ఆనవాయితీ. మార్కండేయ ట్రస్ట్ వ్యవస్థాపక సభ్యులు గంజి చిరంజీవి, రాధ దంపతులు, చిల్లపల్లి శ్రీనివాసరావు, గౌరీ దంపతులు అమ్మవారికి, అయ్య వార్లకు పట్టువస్త్రాలను తీసుకుని ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కెఎస్.రామారావు సాదరంగా స్వాగతం పలికారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయానికి చేరుకుని అమ్మవారిని, మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకుని వస్త్రాలను సమర్పించారు. పట్టు వస్త్రాలను భక్తి శ్రద్ధలతో చేనేత మగ్గాలపై వారం రోజుల పాటు తయారు చేశామని పేర్కొన్నారు. చిల్లపల్లి మోహనరావు, అందే నాగప్రసాద్, గుత్తికొండ ధనుంజయరావు, అవ్వారు శ్రీనివాసరావు, బిట్రా శ్రీనివాసరావు, వేణు, ట్రస్ట్ సభ్యుల కుటుంబీకులు పాల్గొన్నారు.

దివ్యోత్సవం...శివోత్సవం

హరహరో...హరహర మహదేవ...శంభో శంకర అంటూ భక్తులు చేసిన నామస్మరణతో జిల్లాలోని శైవక్షేత్రాలు హోరెత్తాయి. శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామిని దర్శించుకుని తరించారు. రైతులు తమ పశువులను ఆలయాల చుట్టూ తిప్పి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ ఏటికి ఇద్దరం...ముందు నాటికి ముగ్గురం అంటూ నవదంపతులు శివయ్యను స్మరించుకుంటూ మొక్కుబడులు చెల్లించుకున్నారు.

క్వారీలో..

- భక్తులతో పోటెత్తిన క్వారీ దేవాలయం
- జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు
- ఘనంగా మహాశివరాత్రి వేడుకలు
- భారీగా పోలీసు బందోబస్తు
- విద్యుత్ వెలుగుల్లో ప్రభలు



క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానం వద్ద బారులు తీరిన భక్తులు

చేబ్రోలు: మహాశివరాత్రి పండుగ సందర్భంగా క్వారీ బాలకోటేశ్వరస్వామి దర్శనానికి సుమారు లక్ష మంది భక్తులు దర్శించుకున్నట్లు అధికారులు అంచనా. తిరునాళ్ల సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి భక్తులు, ట్రాక్టర్లు, ఆటోలు, కార్లు, ద్విచక్రవాహనాలపై తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసింది. చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు సుమారు 15 భారీ విద్యుత్ ప్రభలను నిర్మించారు. లక్షలాది రూపాయల వ్యయంతో బారీ విద్యుత్ ప్రభలను ఆకర్షణీయంగా నిర్మించారు. దేవాలయం ప్రాంగణం వద్ద వంద అడుగుల పైన ఉన్న భారీ సెట్టింగ్ విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. చేబ్రోలు, తెనాలి పరిసర గ్రామాల నుంచి వందల సంఖ్యలో చిన్న చిన్న ప్రభలు, బాల ప్రభలు, మొక్కుబడు ప్రభలు తరలివచ్చాయి. ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు, ఆటోలలో భక్తులు దేవాలయానికి తరలివచ్చారు. దర్శనం కోసం మహిళలు, వృద్ధులు, పిల్లలు, భక్తులు క్యూలైన్లతోపాటు బయట వరకు బారులు తీరారు. గంటల తరబడి దర్శనం కోసం క్యూలైన్లో వేచి ఉండాల్సి వచ్చింది. మొక్కులు తీర్చుకోవ టం కోసం మహిళలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షెడ్లలో పొంగళ్లు పొంగించుకున్నారు. దేవాలయ సమీపంలో జెయింట్ వీల్, రంగుల రాట్నాలు, తిను బండారాలు, పిల్లలు కొనుగోలు కోసం దుకాణాలు, చెరుకు గళ్ల విక్రయా లు అధికంగా జరిగాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పంచాయతీ, దేవదాయశాఖ, రెవెన్యూ, మండల పరిషత్, వైద్య, పోలీసు శాఖాధికారులకు పలు జాగ్రత్తలు తీసుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా తెనాలి రహదారికి ఇరువైపుల షాపులు లేకుండా అన్నీ ఒకే చోట ఏర్పాటు చేసే విధంగా ఏర్పాట్లు చేశారు. పారిశుద్ధ్యం, ట్రాఫిక్ వంటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించారు.



క్వారీ బాలకోటేశ్వరస్వామి మూల విరాట్

కిలారి, అంబటి ప్రత్యేక పూజలు

వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ సమన్వయకర్త కిలారి వెంకట రోశయ్య, పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణలు దేవస్థానం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చక బృందం ప్రత్యేక పూజలు చేశారు. అభిషేక మండపం వద్ద భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దర్శనానికి అవకాశం కల్పించారు. తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, స్థానిక ప్రజాప్రతినిధులు, స్వామివారిని దర్శించుకున్నారు.

గ్రామాల్లో శివరాత్రి సందడి

మహాశివరాత్రి సందర్భంగా చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామాల్లోని శైవక్షేత్రాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. ఖ్యాతి గాంచిన చేబ్రోలులోని నాగేశ్వరస్వామి, భీమేశ్వరస్వామి దేవస్థానాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగా పార్వతి సమేత నాగేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. మంచాల గ్రామంలోని గంగా పార్వతి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో వివిధ కార్యక్రమాలు జరిగాయి.

పటిష్ట పోలీసు బందోబస్తు

ట్రైనీ ఐపీఎస్ ఆధ్వర్యంలో తెనాలి డీఎస్పీ రమేష్ పర్యవేక్షణలో జిల్లా పరిధిలోని నలుగురు డీఎస్పీలు, 16మంది సీఐలు, 26మంది ఎస్ఐలు, 360 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

భక్తులకు అన్నదానం

క్వారీ బాలకోటేశ్వరస్వామి దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం ఆలయ సమీప ప్రాంతంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణం వద్ద పులిహోర, పొంగలి, లడ్డూ మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని వివిధ భక్త బృందాలు ఏర్పాటు చేశారు. వడ్లమూడి గ్రామ పంచాయతీ సర్పంచ్ మోరంపూడి అనితారాణి, కార్యదర్శి వైపీఏ ప్రసాద్, దేవాదాయశాఖాధికారి పోతుల రామకోటేశ్వరరావు, స్థానిక అధికారులు ఆలయం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు.



విద్యుత్ ప్రభలు

పెదకాకానిలో..

- భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకున్న ప్రముఖులు
- క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు
- స్వామి వారి ఆదాయం రూ.6లక్షలు
- నేడు భ్రమరాంబమల్లేశ్వరస్వామి కల్యాణోత్సవం



పెదకాకాని శివాలయం ముఖద్వారం వద్ద భక్తుల రద్దీ

పెదకాకాని: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పెదకాకాని శివక్షేత్రం మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం ఓం నమఃశివాయ నామంతో మార్మోగింది. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులందరికీ స్వామివారి దర్శనం కలిగేలా ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసర శ్రీరామ వరప్రసాదరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, పాలకవర్గం సభ్యుల నేతృత్వంలో ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. ఆలయం చుట్టూ శివ నామం స్మరిస్తూ పొంగలి ప్రసాదాలు తలపై పెట్టుకుని ప్రదక్షిణలు చేసిన భక్తులు భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారు భ్రమరాంబదేవిగా భక్తులను అనుగ్రహించారు. ఆలయ ప్రాంగణం క్యూలైన్లు భక్తులతో కిక్కిరిపోయాయి. పూలమాలలు, పందిళ్లతో ఆలయ ప్రాంగణమంతటా శోభయమానంగా అలంకరించారు. శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాతసేవ, పంచహారతులు, 8 గంటలకు నిత్యోపాసన, గ్రామబలిహరణ, మధ్యాహ్నం 2:30 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో జరిపించారు. రాత్రి 11 గంటలకు లింగోద్భవకాలంలో స్వామివారికి ఏకాదశ ద్రవ్యములతో అభిషేకం శాస్త్రోక్తంగా జరిపించారు. 12 గంటలకు గజవాహనంపై ఎదుర్కోలోత్సవం నిర్వహించారు.

అన్నప్రసాద వితరణ

మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఆలయానికి తరలివచ్చిన వేలాది మంది భక్తులకు పెదకాకాని వర్తక సంక్షేమ సంఘం, శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త ఆదినేని అంకబాబు, మాజీ సభ్యులు పెండెం విజయ్‌బాబు, దూపాటి వెంకట్రావు, కాకాని సాంబయ్యలు ఉచితంగా అన్నప్రసాద వితరణ చేశారు. పలువురు దాతలు స్వచ్ఛందంగా పులిహోర, పొంగలి, దద్ధోజనం, వాటర్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు ఉదయం నుంచి రాత్రి వరకూ ఉచిత ప్రసాద పంపిణీ చేశారు.



పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి మూలవిరాట్



శివాలయంలో భ్రమరాంబదేవి అలంకరణలో అమ్మవారు

స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖులు

శివరాత్రి పర్వదినాన మల్లేశ్వరస్వామి వారిని పలువురు ప్రముఖులు దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అతిథులకు ఉప కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు, పాలక మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకర రావు, పాలకవర్గం సభ్యులు, అర్చకులు సాదర స్వాగతం పలికారు. ప్రముఖులు శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్లకు ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేదపండితులు స్వామివారి ఆశీర్వచనం చేసి శేషవస్త్రంతో సత్కరించారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో ఎమ్మెల్యే, గుంటూరు పార్లమెంట్ సమన్వయకర్త కిలారి వెంకటరోశయ్య దంపతులు, పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, మాజీ శాసనసభ్యుడు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, మాజీ మేయర్ కన్నా నాగరాజు, గుంటూరు టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, దేవదాయ శాఖ ట్రిబ్యునల్ చైర్మన్ కేవీఎల్ హరినాథ్, వివిధ శాఖల ఉన్నతాధికారులు ఉన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం

గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి కల్యాణం శనివారం తెల్లవారు జామున 2 గంటలకు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ పునః నిర్మాణ దాతలు కొల్లిపర వంశీకులు అమ్మవారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ప్రముఖ కల్యాణ వ్యాఖ్యాత పుల్లాభట్ల వెంకటేశ్వర్లు కల్యాణం వ్యాఖానం చేసినట్లు ఉప కమిషనరు, కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు, పాలక మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకర రావు తెలిపారు. ఒక్కరోజులో స్వామివారికి రూ.6 లక్షల ఆదాయం సమకూరినట్లు డీసీ తెలిపారు.

ఏర్పాట్లు పర్యవేక్షించిన అధికారులు

ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా దేవాలయ ఉప కమిషనరు, పాలకమండలి చైర్మన్, సభ్యులు స్వయంగా పర్యవేక్షించారు. పోలీసు, ఆరోగ్యశాఖ, పంచాయతీ, ఎలక్ట్రికల్, అగ్నిమాపకశాఖల అధికారులు సిబ్బంది విధులు నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు, పాలకమండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, పాలకమండలి సభ్యులు గజ్జల సుబ్బాయమ్మ, కొమ్మూరి శివరత్నాలు, తోట రవీంద్ర, కారంకి నాగేశ్వరమ్మ, గంగవరపు మల్లేశ్వరరావు ఉన్నారు.



ఆలయ ప్రధాన ద్వారం వద్ద వేచి ఉన్న భక్తులు

●సీఎం వైఎస్ జగన్‌కు మహిళల జేజేలు



పొన్నూరు పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన మహిళలు అక్కడ ఉన్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసి జేజేలు పలికారు....చిత్రంలో అంబటి మురళీకృష్ణ తదితరులు

\- పొన్నూరు

అరవపల్లికి తరలిన ప్రభలు



రేపల్లె రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని అరవపల్లి శ్రీ బాలకోటేశ్వరస్వామి తిరునాళ్లకు పరిసర ప్రాంతాలు, గ్రామాల నుంచి తరలివెళ్లిన ప్రభలు ఆకట్టుకున్నాయి. భక్త బృందాల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ప్రభలను ఊరేగింపుగా అరవపల్లి తరలించారు. మహాశివుడి విగ్రహంతోపాటు మంచు ముద్దలతో తయారు చేసిన శివలింగం, అర్ధనారీశ్వరుని విగ్రహాన్ని పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించి తిరునాళ్లకు తరలించారు.

చేదుకో కోటయ్యా...

- కోటప్పకొండ తిరునాళ్లకు భారీగా హాజరైన భక్తులు
- ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి





స్వామి వారికి పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్

నరసరావుపేట/నరసరావుపేట రూరల్: ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి వారి దేవస్థానం శివనామస్మరణతో మారుమ్రోగింది. మహాశివరాత్రిని పురస్కరించుకుని లక్షలాది మంది భక్తులు శుక్రవారం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. రాష్టం నలుమూలల నుంచి భక్తులు పెద్దఎత్తున స్వామి దర్శనం కోసం తరలిరావడంతో కోటప్పకొండ పుణ్యక్షేత్రం భక్తజన సందోహంతో నిండిపోయింది. తెల్లవారుజామున రెండు గంటలకు బిందెతీర్థంతో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఉప ప్రధాన అర్చకులు అప్పయ్యగురుకుల్ ఆధ్వర్యంలో అభిషేక కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం భక్తులను స్వామి వారి దర్శనానికి అనుమతించారు. స్వామి వారి దర్శనం కోసం అర్ధరాత్రి నుంచి భక్తులు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. ఉచిత దర్శనంతోపాటు రూ.100, రూ.200, వీఐపీలు, అభిషేక క్యూల ద్వారా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులతో క్యూకాంప్లెక్స్ కిక్కిరిసింది. ఉచిత దర్శనంలో భక్తుల తాకిడి అధికంగా కనిపించింది. గతంతో పోల్చితే ఈ ఏడాది క్యూలైన్ల ఏర్పాటు బాగుండటంతో భక్తులు త్వరగా దర్శనం పూర్తి చేసుకున్నారు. అభిషేక మండపంలో నిర్వహించిన అభిషేకాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సోపాన మార్గం నుంచి భక్తులు మెట్ల పూజ నిర్వహించుకుంటూ కొండపైకి చేరుకున్నారు. ధ్యానశివుడు, నాగేంద్రుని పుట్ట, నంది విగ్రహం వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. త్రిముఖ శివ లింగం వద్ద యాత్రికులు సెల్ఫీలు తీసుకోవడం కనిపించింది. పలువురు భక్తులు కాలినడకన పాతకోటయ్య స్వామి ఆలయం వద్దకు చేరుకుని దర్శించుకున్నారు. కొండ క్రింద నుంచి 80 తిరుమల-తిరుపతి సప్తగిరి బస్సుల్లో ఆర్టీసీ యాత్రికులను చేరవేశారు. ఘాట్‌రోడ్డులో ఎలాంటి ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా ఎక్కడా ట్రాఫిక్ జామ్ అవ్వకుండా పోలీస్ సిబ్బంది కట్టుదిట్టంగా చర్యలు తీసుకున్నారు. పల్నాడు జిల్లా ఎస్పీ వై రవిశంకర్‌రెడ్డి అక్కడే ఉండి స్వయంగా పర్యవేక్షించారు.

ఎయిడెడ్ నియామకాలపై విచారణ

- గుంటూరులోని మూడు పాఠశాలలకు వెళ్లిన త్రిసభ్య కమిటీ
- ఉపాధ్యాయ నియామకాల్లో అక్రమాలపై నిగ్గు తేల్చేందుకు విచారణ
- వెలుగులోకి తెచ్చిన "సాక్షి"

సాక్షి ఎఫెక్ట్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరంలోని మూడు ఎయిడెడ్ పాఠశాలల్లో చేపట్టిన ఉపాధ్యాయ నియామకాల్లో అక్రమాలపై ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ విచారణ చేపట్టింది. ఆర్డీవో శ్రీకర్ నేతృత్వంలో గురువారం కరస్పాండెంట్ల నుంచి వివరాలు సేకరించింది. కోర్టు ఉత్తర్వులతో నగరంలోని ఎస్ఆర్ఎంటీ ఓరియెంటల్ హైస్కూల్, శ్రీసరస్వతి కమిటీ యూపీ స్కూల్, యాదవ హైస్కూల్లో 14 పోస్టుల్ని యాజమాన్యాలు వేర్వేరు అభ్యర్థులతో భర్తీ చేసుకున్నాయి. అయితే, నియామకాలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరగలేదని, ఆయా పోస్టులకు అర్హులైన పలువురు అభ్యర్థులు గతంలో బహిరంగంగా ఆరోపణలు చేయడంతో పాటు విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. ఎయిడెడ్ ఉపాధ్యాయ నియామకాల్లో అవినీతి, అక్రమాల్ని గత జనవరిలో 'బోధనార్జనే ధ్యేయం' శీర్షికతో ''సాక్షి'' వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించిన పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్. సురేష్‌కుమార్ విచారణకు ఆదేశించారు.

అక్రమాలపై కలెక్టర్‌కు కార్పొరేటర్ ఫిర్యాదు

నియామకాల్లో నిబంధనలు పాటించలేదని, రూ. లక్షల్లో వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపిస్తూ 2వ డివిజన్ కార్పొరేటర్ మర్రి అంజలి గత నెలలో గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఎయిడెడ్ పోస్టుల పేరుతో ప్రకాశం జిల్లాకు చెందిన ప్రసాద్ అనే వ్యక్తి రూ.1.03 కోట్లు వసూలు చేశారని మరొక విశ్రాంత ఉపాధ్యాయుడు బేతపూడి నాగమల్లేశ్వరరావు గత నెలలో ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. కార్పొరేటర్ మర్రి అంజలి ఫిర్యాదుపై స్పందించిన జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని ఆదేశించారు. గురువారం ఆయా పాఠశాలలకు వెళ్లిన అధికారుల బృందం నియామకాలకు అనుసరించిన విధానం, రాత పరీక్ష నిర్వహణ, అభ్యర్థులకు వచ్చిన మార్కులు వంటి వివరాల్ని సేకరించడంతో పాటు రికార్డుల్ని తమ ముందుంచాలని కరస్పాండెంట్లను ఆదేశించింది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, బోధనకు ఉపాధ్యాయులు లేరనే కారణంతో కోర్టును ఆశ్రయించి, నియామకాలకు అనుమతి తెచ్చుకున్న వైనంపై త్రిసభ్య కమిటీ ప్రధానంగా దృష్టి సారించింది. టీచర్లు లేరనే విషయాన్ని సాకుగా చూపడంపై యాజమాన్యాల్ని ప్రశ్నించింది. త్రిసభ్య కమిటీ సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది.

ఆకట్టుకున్న పొట్టేళ్ల ప్రభ



పొన్నూరు : మహాశివరాత్రి సందర్భంగా కట్టింపూడిలోని సంగమేశ్వర స్వామి దేవస్థానానికి పలు ప్రభలు పోటెత్తాయి. తెలగపాలేనికి చెందిన బోడి రామారావు గత 11 ఏళ్లుగా పొట్టేళ్లు, విద్యుత్ దీపాలంకరణతో ప్రభను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా పొట్టేళ్లు, విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన ప్రభ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మేళ తాళాలు తప్పెట్లతో గుడికి ఊరేగింపుగా తీసుకు వెళ్లారు. కార్యక్రమంలో బోడి సుబ్బారావు, ఆదిలక్ష్మి, రామారావు, శ్రీదేవి, ప్రియాంక, వెంకటేశ్వరరావు, లక్ష్మీ ప్రసన్న, మనోజ్ఞ, లక్ష్మీ మేఘన, రావూరి గోపి, లక్ష్మి, ప్రసన్న, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఆఫీస్ సూపరింటెండెంట్‌గా రాజ్‌కుమార్‌కు పదోన్నతి



గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి (డీసీహెచ్ఎస్) పరిధిలోని సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రిలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మట్లపూడి రాజ్‌కుమార్‌కు ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి లభించింది. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ కమిషనర్ కార్యాలయంలో గురువారం పలువురు సీనియర్ అసిస్టెంట్లకు ప్రమోషన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. రాజ్‌కుమార్‌కు ఆఫీస్ సూపరింటెండెంట్‌గా ప్రమోషన్ ఇచ్చి నరసరావుపేట ఏరియా హాస్పిటల్‌కు బదిలీ చేశారు. గుంటూరులో డీసీహెచ్ఎస్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రామకృష్ణను ఆఫీస్ సూపరింటెండెంట్‌గా ప్రమోషన్ ఇచ్చి బదిలీ చేశారు. అమరావతి హాస్పిటల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శివప్రసాద్‌కు సీనియర్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ ఇచ్చి గుంటూరు డీసీహెచ్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆఫీస్ సూపరింటెండెంట్‌గా ప్రమోషన్ పొందిన రాజ్‌కుమార్, రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొందిన శివప్రసాద్‌కు పలువురు ఏపీవీవీపీ జిల్లా వైద్య అధికారులు, కార్యాలయ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

సీఎం జగన్ పాలనలో నిత్యం మహిళా దినోత్సవమే..

- పొన్నూరు మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ డాక్టర్ రూత్ రాణి
- నిజాయతీగా ప్రజా సేవ చేస్తా.. ఆశీర్వదించండి
- వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



కేక్ కట్ చేస్తున్న మురళీకృష్ణ, డాక్టర్ రూత్ రాణి

పొన్నూరు: రాష్ట్రంలో మహిళల అభ్యున్నతికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి పాలనలో మహిళలకు ప్రతిరోజు శుభ దినోత్సవమేనని పొన్నూరు మున్సిపాలిటీ మాజీ చైర్ పర్సన్, వైఎస్సార్ సీపీ, బాపట్ల పరిశీలకులు డాక్టర్ నల్లమోతు రూత్‌రాణి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సభకు డాక్టర్ రూత్‌రాణి అధ్యక్షత వహించారు. ముందుగా కేక్ కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు.

రెండేళ్లుగా ప్రజలతో మమేకం

సమన్వయకర్త మురళీకృష్ణ మాట్లాడుతూ నేత్ర, గుండె, ఫిజియోథెరపీ, దివ్యాంగ శిబిరాలు నిర్వహించి గత రెండేళ్లుగా ప్రజలతో మమేకమయ్యానని తెలిపారు. జగనన్న రాజ్యంలో పొన్నూరు ప్రజలకు మరింత సేవ చేసే భాగ్యం కలిగిందని చెప్పారు. ప్రజలిచ్చే అవకాశంతో పొన్నూరును అభివృద్ధి పథంలో నిలుపుతానని పేర్కొన్నారు. పాతికేళ్లు పాలించిన ఫెత్తందారు ధూళిపాళ్ల ప్రజలకు చేసిన అభివృద్ధిని చూపించలేక పోతున్నాడని విమర్శించారు. పాతికేళ్లు పాలించిన నేతలు ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోవాలని, ఓట్లడుక్కునే దుస్థితి రాకూడదని మండిపడ్డారు. పాడి రైతుల బోనస్ సొమ్ముతో కార్పొరేట్ వైద్యశాలను నిర్మించుకొని తన కుటుంబం, తన వర్గాలకు మాత్రమే వైద్యం అందిస్తున్నారని విమర్శించారు. ఒక్క పేదవానికీ మెరుగైన వైద్యం అందించిన దాఖలాలు లేవని ధ్వజమెత్తారు. సీఎం జగన్ ప్రతి మహిళను సంపద లక్ష్మీగా గుర్తించి అనేక సంక్షేమ పథకాలకు లబ్ధిదారులుగా చేర్చారని వివరించారు. ఇంటికి వెలుగు ఇల్లాలని, ప్రతి కుటుంబం ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు మహిళలనే లబ్ధిదారులుగా చేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందని పేర్కొన్నారు. పొన్నూరు ప్రజలకు నిజాయతీగా సేవ చేస్తానని, ఒక్క రూపాయి కూడా ఆశించకుండా సంక్షేమ పాలన అందిస్తానని హామీ ఇచ్చారు.

చంద్రబాబును నమ్మవద్దు

రూత్‌రాణి మాట్లాడుతూ బూటకపు మాటలు చెప్పే చంద్రబాబును నమ్మవద్దని ప్రజలకు సూచించారు. మేదరమెట్లలో ఈ నెల 10న జరిగే సిద్ధం సభను విజయవంతం చేయాలని మహిళల్ని కోరారు. పొన్నూరు ఎంపీపీ భవనం పద్మలీల మాట్లాడుతూ సీఎం జగన్ చేసిన మేలును మరువకుండా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఘన విజయాన్ని అందించాలని కోరారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మహిళలు తమ అభిమానాన్ని వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో పొన్నూరు పార్టీ పరిశీలకులు అంజిరెడ్డి, మహిళా నేతలు షేక్ షర్మిల, అనిలా కుమారి, అనిత, మోపర్తి కమలమ్మ, గేరా కుమారి, శారద పాల్గొన్నారు. కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ నాజర్, మొల్లా కరీమ్, అమిరినేని సాంబయ్య, ఎండేటి వెంకట సుబ్బయ్య, అంబటి వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.



మాట్లాడుతున్న డీఐజీ రాజకుమారి

అన్ని రంగాల్లో మహిళలు ముందంజ

తాడికొండ: నేడు అన్ని రంగాల్లో మహిళలు ముందంజలో నడుస్తున్నారని ఏపీఎస్పీ బెటాలియన్ డీఐజీ, ఐపీఎస్ అధికారిణి బూరుగు రాజకుమారి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వీఐటీ- ఏపీ విశ్వ విద్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థినులు, మహిళలు వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని, అది ప్రమాదకరమని సూచించారు. ఏపీ పోలీసు శాఖ అభివృద్ధి చేసిన దిశ యాప్‌ను అందరూ తమ ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకోవాలని చెప్పారు. వీఐటీ- ఏపీ వర్సిటీలో ప్రస్తుతం 33 శాతంగా ఉన్న మహిళా విద్యార్థినుల సంఖ్యను రాబోయే కాలంలో 50 శాతానికి పెంచేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. సామాజిక, ఆర్థిక రంగాలలో మహిళా సాధికారతపై వివరించారు. వర్సిటీ వీసీ డాక్టర్ ఎస్.వి.కోటారెడ్డి మాట్లాడుతూ 2017లో 8 శాతం మహిళా విద్యార్థినులతో ప్రారంభమైన తమ క్యాంపస్ నేడు 33 శాతానికి పెరిగిందని, త్వరలో 50 శాతం చేరుతుందని తెలిపారు. ఈ సందర్భంగా స్టార్ స్కీమ్‌లో భాగంగా వీఐటీ ఏపీ వర్సిటీలో ఉచిత విద్యనభ్యసిస్తున్న 2023-24 బ్యాచ్‌కు చెందిన 48 మంది విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా ఉచితంగా ల్యాప్‌టాప్‌లను అందజేశారు. కార్యక్రమంలో స్టూడెంట్ వెల్ఫేర్ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఖాదిర్ పాషా, పలువురు అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నేత మృతి



నీటికుంటలో బ్రహ్మయ్య మృతదేహం

గుంటూరు రూరల్: అనుమానాస్పదస్థితిలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత మృతి చెందిన సంఘటన శుక్రవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళగిరి మండలం యర్రబాలెం గ్రామానికి చెందిన నాదెండ్ల బ్రహ్మయ్య(59) సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీలో కీలకపదవుల్లో పని చేస్తుంటాడు. ఈ క్రమంలో గురువారం గుంటూరులో పార్టీ కార్యాలయంలో మీటింగ్ ఉండటంతో బ్రహ్మయ్య, భార్య సామ్రాజ్యం వచ్చారు. మధ్యాహ్నం వరకూ అక్కడ ఉన్నారు. సామ్రాజ్యం వేరే పని ఉండటంతో, మీటింగ్ ఆలస్యం అవుతున్నందున వెళ్లిపోయింది. మీటింగ్ పూర్తయినా బ్రహ్మయ్య ఇంటికి రాకపోవడంతో పలుమార్లు ఫోన్ చేసిన స్పందన లేకపోవడంతో మిన్నకుండి పోయింది. ఈ క్రమంలో జొన్నలగడ్డ శివారు పొలాల్లో నీటి కుంటలో శవం ఉందని నల్లపాడు పోలీసులకు అందిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులు మృతుని జేబులో ఉన్న ఫోన్ ఆధారంగా వివరాలు సేకరించగా బ్రహ్మయ్య అని తేలింది. దీంతో మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

తెనాలి డబుల్ హార్స్ తాజా ఉత్పత్తి 'చిరుధాన్యాల లడ్డూ'

అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ఆవిష్కరణ



చిరు ధాన్యాల లడ్డు ప్యాకెట్

తెనాలి: ఆహార పరిశ్రమలో దేశవిదేశాల్లో గుర్తింపు పొందిన తెనాలి డబుల్ హార్స్‌కు అనుబంధ సంస్థ అయిన తెనాలి డబుల్ హార్స్ ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్ తన తాజా ఉత్పత్తి 'చిరుధాన్యాల లడ్డూ' (మిల్లెట్ లడ్డు)ను ఆవిష్కరించింది. మహిళా సాధికారత, ఉపాధిపై కంపెనీకి గల అంకితభావాన్ని ప్రతిబింబిస్తూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున మేనేజింగ్ డైరెక్టర్ మునగాల మోహన్‌శ్యాం ప్రసాద్, డైరెక్టర్ లలిత, కంపెనీ ఉద్యోగులతో కలిసి ఈ ఉత్పత్తిని ఆవిష్కరించారు. గ్రామీణశక్తిలో మహిళల పాత్రను ప్రోత్సహించే దృక్పథంతో స్థాపించిన తెనాలి డబుల్ హార్స్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ టీడీహెచ్ దిగ్గజ ఉత్పత్తి 'సున్నుండలు'తో తన ప్రయాణాన్ని ఆరంభించిన విషయం తెలిసిందే. మూడేళ్లలో ఉత్పత్తి శ్రేణిని విస్తరించింది. మొత్తం 40 రకాల్ని ప్రారంభించింది. తాజాగా ఆవిష్కరణ చేసిన పోషకమైన, రుచికరమైన ఉత్పత్తి చిరుధాన్యాల లడ్డూ , సంస్థ ఉద్యోగుల అంకితభావానికి నిదర్శనమని తెలిపారు. ప్రిజర్వేటివ్స్, ఫ్లావర్స్ లేకుండా స్వచ్ఛమైన రుచితో వినియోగదారులను ఆకట్టుకుంటుందని వివరించారు.

విలువలతో కూడిన విద్యతోనే సమాజాభివృద్ధి

- మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు
- ఘనంగా పాటిబండ్ల సీతారామయ్య పాఠశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు, వేదికపై శివాజీ, మల్లికార్జునరావు, విష్ణువర్ధన్

గుంటూరు ఎడ్యుకేషన్: క్రమశిక్షణతో కూడిన విద్యతో సమాజంలో అభివృద్ధి సాధ్యమని, విద్యార్థుల్ని సన్మార్గంలో పయనింపజేయడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమష్టిగా కృషి చేయాలని మిజోరం రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు పేర్కొన్నారు. సమాజంలో విలువల్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు మరింతగా కృషి చేయాలని చెప్పారు. లక్ష్మీపురంలోని పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ హరిబాబు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి వర్గాలకు విద్యను అందించాలనే ఆశయంతో లాం గ్రామంలో పాఠశాలను స్థాపించిన పాటిబండ్ల సీతారామయ్య ఆశయాలకు అనుగుణంగా గుంటూరు నగరంలో ఆయన పేరుతో నెలకొల్పిన పాఠశాల విద్యాభివృద్ధిలో తన వంతు భాగస్వామ్యం అందిస్తోందని ప్రశంసించారు. విద్యారంగాభివృద్ధికి పాఠశాల, వ్యవసాయాభివృద్ధి కోసం లాం ఫారంలో సొంత స్థలాన్ని వ్యవసాయ వర్సిటీ స్థాపన కోసం దానం చేశారని చెప్పారు. రైతాంగం మేలు కోరిన సీతారామయ్య సమాజ దార్శనికుడని కొనియాడారు. ఆయన ఆశయాలకు నిలువుటద్దంగా విద్యారంగంలో సీతారామయ్య పాఠశాల ప్రగతి పథంలో పయనిస్తోందని తెలిపారు. తక్కువ ఫీజులో కార్పొరేట్ విద్యను అందిస్తున్న సీతారామయ్య పాఠశాల ఎందరో విద్యార్థుల్ని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిందని చెప్పారు. పాఠశాల పాలకవర్గ గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యకు సీతారామయ్య పాఠశాల చిరునామాగా నిలిచిందన్నారు. పాలకవర్గ అధ్యక్షుడు దేవినేని మల్లికార్జునరావు మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రంగాల్లో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో విలువలతో కూడిన విద్య అందిస్తున్నామని చెప్పారు. పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ విద్యాబోధనలో సుశిక్షితులైన ఉపాధ్యాయ బృందంతో తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా విద్యార్థుల్ని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు అద్భుతమైన సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో గన్నమనేని విజయలక్ష్మి, పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

10న రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఏపీ చెస్ అసోసియేషన్, శ్రీ ఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన లాంలోని చలపతి కాలేజీలో రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ పోటీలు జరుగుతాయని నిర్వాహకుడు ఎం.గోపీనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం ప్రైజ్ మనీ కింద రూ.50,500తోపాటు ట్రోఫీలు అందజేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి అగ్ర చెస్ ప్లేయర్స్ పాల్గొంటారన్నారు. వివరాలకు 97030 49378 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

క్రీస్తుని నమ్మిన వారికి నిత్య జీవం

- హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ
- రెండవ రోజు కొనసాగిన 47వ అంతర్జాతీయ గుడారాల పండుగ ప్రత్యేక ప్రార్థనలు
- హోసన్న, హల్లెలూయా అంటూ మారుమోగిన ప్రదేశం
- దేశ విదేశాలనుంచి 4 లక్షలకు పైగా పాల్గొన్న భక్తులు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, పాస్టర్ రాజు



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

గుంటూరు రూరల్: ఏసుక్రీస్తుని నమ్మిన వారికి ఆయన నిత్యజీవాన్ని కలుగ జేస్తాడని హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, చీఫ్ పాస్టర్ జాన్ వెస్లీ తెలిపారు. నగర శివారుల్లోని గోరంట్ల గ్రామంలోగల హోసన్న మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఏటా ప్రతిష్టాత్మకంగా జరిగే అంతర్జాతీయ 47వ గుడారాల పండుగ రెండవ రోజు శుక్రవారం కొనసాగింది. మచిలీపట్నానికి చెందిన పాస్టర్ మోషే ప్రత్యేక ప్రార్థన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా హోసన్న మినిస్ట్రీస్ బ్రదర్స్ సిస్టర్స్ ఆలపించిన పరిశుద్ధుడవూ, ప్రేమ పూర్ణుడవూ, ఘనమైనది నీకార్యం అనే క్రీస్తుని గీతాలు భక్తుల్ని అలరింపజేశాయి. అనంతరం క్రీస్తు వాక్యాన్ని భక్తులకు అందిస్తూ పాస్టర్ మిల్టన్ లాజరస్ మాట్లాడుతూ దేవుడు ఆయన భక్తులకు పరిశుద్ధాత్మతో కూడిన ఆరోగ్యాన్ని అందిస్తాడని తెలిపారు. క్రీస్తు భక్తులు పరిశుద్ధ హృదయాన్ని కలిగి ఉండాలన్నారు. ఒంగోలుకు చెందిన పాస్టర్ రాజు ఉపదేశాన్ని అందిస్తూ దేవుని సంఘం పరిశుద్ధత కలిగి ఉండాలన్నారు. పరిశుద్ధమైన మనస్సుతో ఆయన్ను స్తుతించాలని తెలిపారు. క్రీస్తుని నమ్మినవారికి విజయాలు సొంతమవుతాయని చెప్పారు. మదనపల్లికి చెందిన పాస్టర్ రాజశేఖర్ ప్రసంగిస్తూ ఏసు క్రీస్తు భక్తుల కోసం, ప్రజల కోసం ప్రార్థన చేస్తున్నాడన్నారు. ప్రతి ఒక్కరూ తమ పాపాల్ని వదిలి మారు మనస్సు పొంది పరిశుద్ధాత్మతో జీవించాలని సూచించారు. సాయంత్రం ప్రత్యేక ప్రార్థనల్ని మచిలీపట్నానికి చెందిన పాస్టర్ రాజేష్ ప్రారంభించారు. హోసన్న మినిస్ట్రీస్ బ్రదర్స్, సిస్టర్స్ క్రీస్తు నామాన్ని ఘనపరుస్తూ క్రీస్తుని స్తుతి గీతాలు ఆలపించారు. హోసన్న మినిస్ట్రీస్ సండే స్కూల్ చిన్నారులు క్రీస్తు స్తుతి గీతాలకు అభినయించారు. అద్దంకికి చెందిన చెవిటి మూగ పిల్లలు మోనో యాక్షన్ చేశారు. బ్రదర్ అబ్రహాం క్రీస్తు సందేశాన్ని భక్తులకు అందిస్తూ ఏసు క్రీస్తు ప్రతి ఒక్కరి జీవితాన్ని పరిమళింపజేస్తాడని తెలిపారు. ఆయన నిత్య జీవనాన్ని, ప్రేమను అందజేస్తాడని చెప్పారు. పాస్టర్ జాన్ వెస్లీ మాట్లాడుతూ నీతి అనే దక్షిణ హస్తంతో క్రీస్తు భక్తులకు ఆదుకుంటాడని పేర్కొన్నారు. ఆయన కౌగిలిలో హెచ్చించి తన భక్తులకు ప్రేమను పంచుతాడని వివరించారు. రెండవ రోజు ప్రత్యేక ప్రార్థనల్లో 4 లక్షల మందికి పైగా భక్తులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు భోజన వసతి ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక ప్రార్థనలు ఆదివారం మధ్యాహ్నంతో ముగుస్తాయని తెలిపారు.

క్వారీ తిరునాళ్లలో భారీ విద్యుత్ ప్రభల ధగధగలు



విద్యుత్ వెలుగుల్లో క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానం

చేబ్రోలు: మహా శివరాత్రి సందర్భంగా వడ్లమూడి క్వారీ తిరునాళ్లలో శుక్రవారం రాత్రి భారీ విద్యుత్ ప్రభలు ధగధగలాడాయి. జిల్లాలో కోటప్ప కొండ తరువాత పేరు గాంచిన చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ తిరునాళ్లకు ఈ ఏడాది 15 భారీ విద్యుత్ ప్రభలు తరలివచ్చాయి. దేవాలయం వద్ద నారాకోడూరు యాదవ సమాజం ఆధ్వర్యంలో 111 అడుగుల భారీ విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు. దేవాలయానికి ఎదురుగా గొడవర్రు గ్రామ ప్రభను నిలిపారు. అత్యధికంగా నారాకోడూరు నుంచి ఆరు ప్రభలు ఆకట్టుకున్నాయి. సుద్దపల్లి, చేబ్రోలు, గొడవర్రు, గుండవరం, వడ్లమూడి, శలపాడు గ్రామాల నుంచి కూడా భారీ విద్యుత్ ప్రభలు తరలివచ్చాయి. దీంతో నారాకోడూరు వద్ద ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు.



చేబ్రోలు గ్రామ ప్రభ



గుండవరం గ్రామ ప్రభ